గుర్తింపు దక్కేదాకా పోరాటం చేస్తాం

మాట్లాడుతున్న యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్

ఇబ్రహీంపట్నం, మే 26: ప్రభుత్వ, కుల సంఘ, పార్టీలపరంగా జిల్లాలో ఉన్న యాదవులకు గుర్తింపు దక్కేదాకా పోరాటం చేస్తామని యాదవ సంఘం అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం అమక్కపేట గ్రామ యాదవ సంఘ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోట్ల చిన్నయ్యయాదవ్, మ్యాదరవేని రామాంజనేయులు యాదవ్, అంకం శంకర్‌యాదవ్, ముక్కెర లింబాద్రి యాదవ్, గుండెల నగేశ్ యాదవ్, మండల నాయకులు ముక్కెర వేణు గోపాల్‌యాదవ్, పంతంగి వెంకటేష్‌యాదవ్‌తో కలిసి సభ్యత్వ నమోదు సంఘ బలోపేతం, సమస్యల పరిష్కారం జనాభా ప్రాతిపదిక యాదవులకు దకాల్సిన హక్కుల సాధన తదితర విషయాలను చర్చించారు. అనంతరం 36మందికి సభ్యత్వ నమోదు రసీదును అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు మనోజ్, రాజన్న, మహేశ్, మహేందర్, గోపి, గంగాధర్, రాజారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో రఘువరన్

నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

పెగడపల్లి, మే 26: జిల్లాలో మరో నాలుగు రోజుల్లో ఐకేపీ(సెర్ప్) కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరన్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి, మాట్లాడారు. జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 12లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 50 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం మండల పరిషత్‌లో రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలను పరిశీలించారు. అలాగే ఎల్లాపూర్‌లో ఉపాధి హామీలో భాగంగా నిర్మించిన కోళ్లఫారం షెడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, సెర్ప్ ఏపీఎం డీ సమత, ఈజీఎస్ ఏపీవో అనిల్‌కుమార్, టైపిస్ట్ తిరుపతి, సీసీ శశికుమార్, ఎఫ్ఏ మల్లేశం పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

జగిత్యాల కలెక్టరేట్, మే 26: జగిత్యాల పట్టణ కేంద్రంలో పేకాట స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని కృష్ణానగర్‌లో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేయగా, ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని జగిత్యాల టౌన్ పోలీసులకు అప్పగించామని, వీరి వద్ద నుంచి రూ.12,750 స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ దాడిలో సీసీఎస్ కానిస్టేబుల్స్ అఫ్రోజ్, కమలాకర్, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిపోతున్న ప్రైవేట్ ఫైనాన్స్ ఆగడాలు

జగిత్యాల, మే 26: జిల్లాలో ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయని, వారి వేధింపుల నుంచి తమను కాపాడాలని జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లికి చెందిన పలువురు గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హామీల అమలులో
కాంగ్రెస్ విఫలం

- ఏడాదిన్నర పాలనపై ప్రజల్లో ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుదాం
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు
- మల్లాపూర్‌లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, మే 26: గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని కేఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై ఇప్పటికే ప్రజల్లో తీవ్రంగా వ్యతిరేకత వచ్చిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. అలాగే గ్రామాల్లో బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, వచ్చే ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించి సత్తా చాటాలని కోరారు. గ్రామాల్లోని కార్యకర్తలకు ఎల్లవేళలా తాను అండగా ఉంటానన్నారు. ఏ సమస్య వచ్చిన తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి సరోజన, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ బీ సత్యప్రసాద్ • పలు కొనుగోలు కేంద్రాల తనిఖీ

ధర్మపురి: జైన కొనుగోలు కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ధర్మపురి/జగిత్యాల రూరల్, మే26: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం ధర్మపురి మండలం జైన, జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఆరబోసి, మ్యాచర్ వచ్చిన వెంటనే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యాన్ని ప్రతిరోజూ మిల్లులకు పంపించాలన్నారు. వాహనాల, హమాలీల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మధుసూదన్, డీఎం జితేంద్రప్రసాద్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్, ధర్మపురి ఇన్‌చార్జి తహసీల్దార్ సుమన్, జైన పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్ ఉన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి

జగిత్యాల, మే 26: ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటవెంటనే సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించాలన్నారు. కాగా, ప్రజావాణికి 59ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

- జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము

జగిత్యాల టౌన్, మే 26: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి కే రాము పేర్కొన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోందన్నారు. ఇందుకు ఎంతో మంది పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్‌లో అవగాహన కల్పించాలన్నారు. మన చుట్టు పక్కల ఉండే వాళ్లను మాయమాటలు చెప్పి వ్యభిచార గృహాల్లో అమ్ముతున్నారన్నారు. ఇక్కడ బలరామకృష్ణ, జీఈసీవో అనుపమ, ఎస్‌వో నిషాంత్, శాహెద, ప్రిన్సిపాల్ సరితాదేవి, ప్రజ్వల సిబ్బంది అంబర్‌సింగ్, ఆయా పాఠశాలల టీచర్లు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి రూరల్, మే 26: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో అతిథి ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పీజీటీ సంస్కృతం(1), తెలుగు(2), గణితం(1), బయాలజీ(1), సోషల్(1), టీజీటీ గణితం(1), సోషల్(1), జూనియర్ లెక్చరర్ గణితం(1), ఫిజిక్స్(1), కెమిస్ట్రీ(1), బోటనీ(1), జూలోజీ(1) సబ్జెక్టులలో అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలన్నారు. అభ్యర్థులు వారు బోధించే సబ్జెక్టుల్లో బీఎడ్, పీజీలో కనీసం 55శాతం మార్కులతోపాటు బోధనలో అనుభవం ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31లోపు తమ దరఖాస్తులు సమర్పించాలని, జూన్ 2న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం నంబర్‌ను (9866559700) సంప్రదించాలని సూచించారు.

ఇంటర్వ్యూకు పెద్ద ఎత్తున తరలివచ్చిన లబ్ధిదారులు

'రాజీవ్ యువవికాసం' మళ్లీ దరఖాస్తులేంది?

జగిత్యాల, మే 26: జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో రాజీవ్ యువవికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించగా, వెయ్యి మందికి పైగా అభ్యర్థులు తరలివచ్చారు. అభ్యర్థులంతా మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో దరఖాస్తు దారులంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పుడు ఇంటర్వ్యూ చేసే సమయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. సమావేశానికి బ్యాంకు అధికారులు రాకపోవడంతోనే సంబంధిత అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబుతున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

గోడపై అతికించిన లిస్ట్ తొలగింపు

- 'నమస్తే' కథనానికి స్పందించి అధికారులు
- సిబిల్ స్కోర్ లేని లబ్ధిదారులకు సైతం ఇంటర్వ్యూలు

మండల పరిషత్ కార్యాలయంలో కిక్కిరిసిన లబ్ధిదారులు

మల్లాపూర్, మే 26: రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో సిబిల్ స్కోర్ లేని లబ్ధిదారుల వివరాలను కార్యాలయం గోడకు అతికించడంతోపాటు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించలేదు. ఈ విషయమై నమస్తే తెలంగాణ పత్రికలో 'గోడెక్కిన రాజీవ్ యువవికాసం' శీర్షిక పేరిట ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం కార్యాలయం గోడపైన ఉన్న సిబిల్ స్కోర్ లేని లబ్ధిదారుల లిస్ట్‌ను తొలగించి, వారికి సైతం ఇంటర్వ్యూలు చేసినట్లు ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి తెలిపారు. దీంతో కార్యాలయంలో ఇంటర్వ్యూల కోసం దరఖాస్తు దారులు తండోపతండాలుగా తరలివచ్చారు.

రిజర్వేషన్ అందించాలి

మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగ సంఘం నాయకులు

కోరుట్ల, మే 26: రాజీవ్ యువవికాసం పథకంలో దివ్యాంగులకు రిజర్వేషన్లు అందించాలని దివ్యాంగుల సంఘం నాయకులు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగ సంఘం నేతలు అబ్దుల్ అజీజ్, ఓంప్రకాశ్, వొడ్నాల శ్రీనివాసరావు, నాగరాజు, లంక దాసరి దేవదాస్, సాయిరాం, శేఖర్ పాల్గొన్నారు.

వార్షిక ఇంక్రిమెంట్ వేయాలి

డీఐఈవోకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

జగిత్యాల రూరల్, మే 26: జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న దాదాపు 138మంది జూనియర్ లెక్చరర్లకు నిలిపివేసిన వార్షిక ఇంక్రిమెంట్‌ను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోషియేషన్ 711 ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నారాయణకు వినతిపత్రం అందజేశారు. మల్లాపూర్, జగిత్యాల గర్ల్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మాత్రమే ఇంక్రిమెంట్ చేసి శాలరీ బిల్లులు సబ్మిట్ చేశారని, మిగతా కళాశాల ప్రిన్సిపాల్స్ తమకు రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్స్ నిలుపుదల చేశారని, వీలైనంత త్వరగా రెండు వార్షిక ఇంక్రిమెంట్‌ను ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వీ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి పీ తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి విజేందర్ రావు, సభ్యులు తిరుపతి, రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి బర్త్‌డే వేడుకలు

నర్సమ్మ పుట్టిరోజు వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

కోరుట్ల రూరల్, మే 26: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామానికి చెందిన రాజోజి భూమాచారి అమ్మ మేడపు నర్సమ్మ వంద సంవత్సరాల పుట్టిన రోజు వేడుకలను మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్‌రెడ్డిగార్డెన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఆమె కొడుకులు-కోడళ్లు, కూతుళ్లు-అల్లుళ్లు, మనుమండ్లు, మనుమరాల్లు సుమారు 80మంది కలిసి నర్సమ్మతో కేక్‌ను కట్ చేయించారు. తర్వాత సంబురాలు చేసుకొని సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.

ఎమ్మార్సీకి చేరుకున్న పాఠ్యపుస్తకాలు

ఇబ్రహీంపట్నం, మే 26: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనానికి పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో మధు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మండలంలోని 31పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 14,466 పుస్తకాలకు గానూ 13,506 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, ఇంకా 906 పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. పాఠశాలలు తెరవగానే ఆయా పాఠశాలకు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవీందర్, శివరాం, ఎంఐఎస్ కార్తిక్, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మల్యాల, మే 26: విద్యాసంవత్సర ఆరంభానికి ముందుగానే సోమవారం మండల విద్యావనరుల కేంద్రానికి పాఠ్యపుస్తకాలను చేరుకున్నాయి. మండల వ్యాప్తంగా 39 పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించి, పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో జయసింహారావు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

కొడిమ్యాల, మే 26: అన్ని గ్రామాల్లో 2025-26 సంవత్సరానికి గానూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూప సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి (గట్ల వెంబడి మాత్రమే), డ్రాగన్ ఫ్రూట్ (20గుంటలకు మాత్రమే), సపోట, ఆయిల్‌పామ్, బత్తాయి, అల్లనేరెడు తోటల పెంపకానికి అవకాశం కల్పించనునట్లు చెప్పారు. రైతులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ ఏపీవో, టీఏకు అందించాలన్నారు.

ఇంటర్వ్యూలకు హాజరుకావాలి

ఇంటర్వ్యూలను పరిశీలిస్తున్న కమిషనర్ మోహన్

మెట్‌పల్లి టౌన్, మే 26: రాజీవ్ యువవికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు తప్పనిసరిగా హాజరుకావాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, బ్యాంకు సిబ్బంది చేస్తున్న ఇంటర్వ్యూల తీరును కమిషనర్ పరిశీలించి, మాట్లాడారు. మున్సిపల్ కార్యాలంలో ఉదయం 10గంటలకు బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, టీఎంసీ సోమిడి శివ, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల విడుదలపై
అబద్ధపు ప్రచారం

గంగాధర, మే 26: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు విడుదల చేసినట్లు ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తున్నదని సర్పంచుల జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ, జీపీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబీ రికార్డు చేసి, గ్రామ పంచాయతీ నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులు, జనరల్ ఫండ్ నుంచి మాత్రమే బిల్లులు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎస్‌డీఎఫ్ ద్వారా కాంట్రాక్టర్లు మాత్రమే వారు చేసిన పనులకు బిల్లులు తీసుకోవచ్చని, జిల్లాలో రెండు వేల బిల్లులు పెండింగ్‌లో ఉంటే కేవలం తొమ్మిదింటి చెక్కులను మాత్రమే విడుదల చేసిందన్నారు. త్వరలోనే చీఫ్ సెక్రటరీ, పంచాయతీరాజ్ కమిషనర్‌ను సమాచార హక్కు చట్టం ద్వారా సర్పంచులకు సంబంధించి రావాల్సిన బిల్లుల గురించి సమాచారం కోరుతామన్నారు.

డిగ్రీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు
వన్‌టైం అవకాశం

కార్పొరేషన్, మే 26: ఉస్మానియా యూనివర్సిటీలో 2000 నుంచి 2015 మధ్య బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ చదివి బ్యాక్ లాగ్స్ ఉన్న విద్యార్థులకు వన్‌టైం అవకాశం ఇస్తూ పరీక్షల విభాగం నిర్ణయం తీసుకున్నట్లు కంట్రోలర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇయర్ వైస్ స్కీమ్ కింద 2000-2015 మధ్య చదివి ఫెయిల్ అయిన విద్యార్థులు, తిరిగి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొంది. నిర్ణీత రుసుం చెల్లించి జూలైలో జరిగే పరీక్షలకు హాజరు కావచ్చని తెలిపింది. విద్యార్థులు చదివిన కాలం చివరి సంవత్సరం సిలబస్ ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. బ్యాక్ లాగ్ పరీక్షలు రాసే విద్యార్థులు జూన్ 19వరకు ఆలస్య రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చని, రూ. 500 ఆలస్య రుసుముతో జూన్ 24 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది. ఇతర వివరాల కోసం www.osmania.ac.in లో చూడవచ్చని తెలిపింది.

అప్లై చేసుకోవాలి

కరీంనగర్‌కలెక్టరేట్, మే 26 : భద్రాద్రి జోన్ పరిధిలోని వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాల్లో గల 19 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన బోధన సిబ్బంది, లైబ్రేరియన్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు, జోనల్ అధికారి కె.స్వరూపారాణి తెలిపారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు యూజీసీ గుర్తింపు పొందిన ఏదైనా వర్సిటీ నుంచి కనీసం 50శాతం మార్కులతో పీజీ చేయడంతో పాటు బీఈడీ అర్హత, టీజీటీ పోస్టులకు డిగ్రీలో 50శాతం మార్కులతో పాటు బీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. రెసిడెన్షియల్ విద్యాబోధనపై అవగాహన, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 29 లోగా హనుమకొండలోని హంటర్‌రోడ్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తమ పూర్తి వివరాలతో కూడిన బయోడేటా, ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఈనెల 31న మడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించే డెమో తరగతులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకుని రావాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలకు..

2024-25 విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9,10 తరగతులు చదివిన విద్యార్థులు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, ఎం.అనిల్ ప్రకాశ్ తెలిపారు. గతంలో నోటిఫికేషన్ విడుదల చేసినా, తక్కువ సంఖ్యలో మాత్రమే విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. www.tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో కూడిన ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలని, సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరి

జగిత్యాల టౌన్, మే 26: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలని, సంబంధిత షాపు యజమానుల నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విత్తనాలు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విత్తనాలు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించ వద్దన్నారు. విత్తనాల గడువు తేదీని పరిశీలించాలని డీలర్లకు సూచించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు అమ్మకూడదని బీటీ-3 కాటన్ విత్తనాలు, లూస్ విత్తనాలు, నకిలీ విత్తనాలు, విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే మండల వ్యవసాయశాఖ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలన్నారు. ఇక్కడ డీఏవో భాస్కర్, డీలర్లు, తదితరులు ఉన్నారు.

భయాందోళనలకు గురిచేయవద్దు

కోరుట్ల, మే 26: కరోనా పేరిట ప్రజలను భయాందోళనకు గురిచేయవద్దని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, గతంలో కరోనా వ్యాధి సృష్టించిన విధ్వంసం మరువక ముందే ప్రజల్లో మళ్లీ గందరగోళం సృష్టించేవిధంగా లేనిపోనివి కల్పించి అవాస్తవాలను వ్యాప్తి చేయడం మానుకోవాలన్నారు. సోషల్ మీడియాలో పుకార్లను పదేపదే ప్రచారం చేయ వద్దన్నారు. వ్యాపార దృక్పథంతో ప్రజల్లో భయోత్పాతం సృష్టించి లబ్ధిపొందాలని కొందరు చూస్తున్నారని, అలాంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు.

చెరువులో పడి బర్రె మృతి

- రూ.80వేల వరకు నష్టం

పెగడపల్లి, మే 26: మండల కేంద్రంలోని యాపల్ చెరువులో గరిగె సంజీవ్‌కు చెందిన పాడి బర్రె సోమవారం ప్రమాదవశాత్తూ పడి మృతిచెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. బర్రె తాగునీటి కోసం స్థానిక చెరువులోకి దిగిందని, ఆ సమయంలో చెరువులోని తీగ చెట్లు కాళ్లకు తట్టుకుని బయటకు రాలేక బురదలోనే కూరుకుపోయి ఊపిరాడక మృతి చెందినట్లు బాధిత రైతు బోరున విలపించాడు. బర్రె విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని కోరాడు.

ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

జగిత్యాల, మే 26: జిల్లాలోని పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన గౌడ విద్యార్థులు ప్రతిభా పురస్కారాల కోసం జూన్ 5లోగా దరఖాస్తు చేసుకోవాలని గౌడ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుర్గపు రవీందర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 540, ఇంటర్మీడియేట్‌లో 900పైగా మార్కులు సాధించిన విద్యార్థులు వారి పూర్తి వివరాలతో రవీందర్‌గౌడ్ (93475645179), ప్రధా న కార్యదర్శి రాజయ్య (9441251719), కోశాధికారి జీ సత్యనారాయణ (98494 66178) వాట్సాప్‌లో సంప్రదించాలని కోరారు.

'రాజీవ్ యువవికాసం' ఇంటర్వ్యూలు

కోరుట్ల, మే 26: మున్సిపల్ కార్యాలయంలో రాజీవ్ యువవికాసం పథకంలో భాగంగా అభ్యర్థులకు సోమవారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 1,700 మంది బీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, 1,180 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, డీఈఈ సురేశ్, టీపీవో ప్రవీణ్‌కుమార్, టీపీఎస్ రమ్య, అధికారులు, ఉన్నారు.

సారంగాపూర్, మే26: రాజీవ్ యువవికాసం పథకంలో బీసీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఎంపికకు మండల పరిషత్ ఆవరణలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌడారపు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్, మే 26: మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపీడీవో వోదెల రామకృష్ణ సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేశారు. ఇక్కడ ఏపీవో కృపాకర్, ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

మల్యాల, మే 26: మండల వ్యాప్తంగా రాజీవ్ యువవికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మూడు రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూల నిర్వహణ కార్యక్రమం పూర్తయిందని ఎంపీడీవో అవునూరి స్వాతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాటగిరీల వారీగా బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించామని, లబ్ధిదారుల ఎంపిక జాబితాను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
LOST
★తేది: 24-05-2025, శనివారం రోజున మా ఇంటి నుండి రామగుండం రైల్వే స్టేషన్‌కి ఆటోలో వెళ్తుండగా నా యొక్క ఒరిజినల్ SSC Memo (Roll No: 0934132067) & Inter Memo (H.T. No: 1218311025) పోయినవి. దొరికిన వారు సంప్ర: దుర్గం స్రవంతి D/o. రాజం. సెల్: 9949739103.
NTK-330421
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189